

# ఛలో హైదరాబాద్

**- అనూరాధ**

"వదినా, అమ్మా, ఇవ్వాల్టి పేపరు చూశారా?"

"పూర్తిగా లోపలికి రావే శిరీషా, నీ ఆత్రం బంగారం కానూ, వదిన చూసి చెప్పిందిలే, అప్పట్నించీ బళ్లోంచి నువ్వెప్పుడొస్తావా'అని కాసుక్కూచున్నా."

"పొద్దున్న టైం లేక ఇంట్లో పేపరు చూళ్లేదమ్మా నేను. లంచ్ టైంలో స్కూల్లో చూశాను."

"అంతేలే పేపర్లు చూడ్డం, పేరంటాలు పిలుచుకోవడం తప్ప మీరు స్కూళ్లో పాఠాలు చెప్తారా?"

"పోనీ మళ్లీ బళ్లో చేరి చూడ్రా అన్నయ్యా! పాఠాలూ విందుగాని, దెబ్బలూ తిందుగాని."

"ష్! నువ్వుండవే, మాటకడ్డురాకండి. అది కాదురా రాజూ! వచ్చే నెల్లో హైదరాబాదులో ఆంధ్ర రచయిత్రుల సభలు జరుగుతున్నాయి. ఆ సంగతి యివాళే పేపర్లో వచ్చింది;

ఎంట్రీ ఫీజు కట్టి అప్లికేషన్లు పంపమని. బసా, భోజనం సమస్యలేదు. వాళ్లదే పూచీ. అంచేత నేనూ, నా కూతురూ, కోడలూ ముగ్గురం వెళ్తే ఎలా వుంటుందీ అని ఆలోచిస్తున్నాం."

"ఏవిటీ? మీరు ముగ్గురూ రచయిత్రులేనా?"

"ఏం కాదా?"

"ఇలా ముగ్గురూ ఐక్య కంఠంతో ఘోషిస్తుంటే కాదనే ధైర్యం ఎవరికుంటుంది? అర్హతలే అనుమానం."

"చాల్లే, నా వచన కవితలు నీకు రచనల్లా ఆనడం లేదు. తలగడా సైజులో నవలలు సృష్టిస్తేనే మీ దృష్టిలో రచయిత్రి. అసలు నీకు తెలుగు సాహిత్యం గురించి ఏం తెలుసురా అన్నయ్యా? పద్యాలు చెప్పిన అత్తాకోడళ్లే తొలి తెలుగు రచయిత్రులు. యుద్ధంలో ఓడిపోయి వెనక్కి వచ్చిన ఖడ్గ తిక్కన భార్యా, తల్లీ ఆశువుగా చెప్పారాపద్యాలు. అతన్ని ఎద్దేవా చేస్తూనూ, ఎత్తిపొడుస్తూనూ. కాబట్టి రచయిత్రుల తొలి రచన కవిత. అంతే కానీ నవలా కాదు, నాటకమూ కాదు. అదీ కవితకీ, కవయిత్రికీ గల ప్రాముఖ్యత?"

"సరే, సరే, సరే. ఆ సంగతి చరిత్రే కాదు, మేమూ గుర్తించాం. అయితే శిరీష ఎంట్రీకే ఫస్ట్ ప్రిఫరెన్స్ రమాదేవీ, మరి నీ సంగతేమిటి? నీ క్వాలిఫికేషను సరిపోతుందా?"

"మరీ అంత అమాయకంగా అడగఖ్ఖర్లేదు. మీ వెటకారం నాకు కొత్తా? పాకశాస్త్రం అరవై నాలుగు కళల్లో ఒకటి. చిన్న చూపు చూడకండి అన్నపూర్ణని. ఆనక బాధపడాలి."

"అవుననుకో. అయినా వంటలు మాత్రమే కంట్రిబ్యూట్ చేస్తుంటే సాటి రచయిత్రిగా గుర్తిస్తారా అని చిన్న డౌట్. అంతే!"

"వంటలు చేస్తున్న వాళ్లందరూ ఎలా చెయ్యాలో రాయగలరా? రచనలు చేస్తున్న వాళ్లందరూ ఒక్క ఐటమ్ అయినా రాసి, చేసి చూపించగలరా? "నోరూరగ, చవులు బుట్ట" వంటింట్లో ఎదురుగా పీటేసుక్కూమని చేసి చూపించినట్టు రాసి ఒప్పించే నేర్పు ఎందరికుంటుంది? అయినా నేను ఒఠ్ఠి వంటలు మాత్రమే రాస్తున్నానా? శీతాకాలంలో చర్మ సంరక్షణ, వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలూ, వర్షాకాలంలో మీ లిటిల్ హార్ట్స్ ఆరోగ్యం అదుపు, ఆజ్ఞలు అత్తగారి ఆస్తా? భర్తగారి స్వంతమా? పండగల ప్రాముఖ్యత- ఏ దేవుడికి ఏ పిండి వంట యిష్టం? ఎలా తయారుచెయ్యాలి? కొత్త కోడలికి కొన్ని మార్గదర్శక సూత్రాలు. మధుమేహం, మారణహోమం, ఆసనాలు- వ్యసన నాశనాలు, వృద్ధాప్యం శాపమా? ఇలా వెయ్యిన్నూట పదహారు వ్యాసాలు రాశారు తెలుసా? ఫిక్షన్‌దేవుందీ ఫస్ట్‌క్లాస్ వాడు కూడా కాకి కథ రాస్తాడు. ఎంత అవేర్‌నెస్ లేపోతే యిన్ని డిఫరెంట్ సబ్జెక్ట్స్ రాయగలను?"

"అవున్నిజం, అవున్నిజం నీవన్నది నిజం నిజం. కానీ ఈ పాకశాస్త్ర రచన సాహితీ వ్యాసంగం అని బుధులు శిష్టులు అంగీకరిస్తారా? అలా జరిగిన పక్షంలో అది ఏ విభాగంలో చేరుతుంది?"

"అదీ బుద్ధిమంతుల లక్షణం. తెలీని విషయాలు ఇలా అడిగిమరీ తెలుసుకోవాలి. వినండి శ్రద్ధగా! రచనలు చెయ్యడం, వంట చెయ్యడం ఒకే కొమ్మకు విరిసిన రెండు రంగుల వేర్వేరు పువ్వులు. ఈ సృష్టిలో ఎక్కడో అరుదుగా ఒక్క స్త్రీమాత్రమే చెయ్యగల అద్భుతం. సాహిత్యానికీ, పాకశాస్త్రానికీ సన్నిహిత సంబంధం వుంది. ఫరెగ్జాంపుల్ కవిత్వంలో ద్రాక్షాపాకం, కదళీపాకం, నారికేళ పాకం అంటారా

అలాగే పిండివంటల్లో లేత పాకం, ముదురు పాకం, తీగ పాకం, ఉండ పాకం, అరిసెల పాకం, జీడి పాకం యిలా.

పాషాణ పాకం రెండు రంగాల్లోనూ కామను.

అక్కడ నవరసాలూ, ఇక్కడ షడ్రుచులూ.

వండి వడ్డించేవారు రచయితలు, విందుభోంచేసేవారు పాఠకులు.

రెండుచోట్లా రసాస్వాదనే సాఫల్యం.

ఘనత వహించిన పంచరత్న కీర్తనల్లానే మనం వండుకునే కూరల్లోనూ ఘన పంచరత్నాలని వున్నాయి తెలుసా మీకు? గుమ్మడికాయా, గుత్తొంకాయా, కందా, బచ్చలీ, అర్టికాయా, పనసకాయా, అప్పడాలూ, వడియాలూ, ఊరు మిరపకాయలూ, ఊరగాయలూ, రకరకాల పొళ్లూ ఈ యిదు పదార్థాలూ పంచకావ్యాలను మించినవి..."

"అమ్మా, రమా అడ్డొస్తే వచ్చా కానీ అభిప్రాయం చెప్పకుండా వుండలేకపోతున్నాను. అరటి పండొలిచి చేతిలో పెట్టినట్టు చెప్తున్నావనుకో. 'తింటున్నామా, వింటున్నామా అన్న భ్రాంతిలో పడిపోతున్నాననుకో. కానీ, కానీ."

"ఏదో మీ అభిమానం, ఆశీస్సులూ అత్తయ్యా. ప్రొఫెషనల్ జెలసీ లేదు మీకు. ఆ ఎంతవరకూ వచ్చాం, ట్రాజెడీలు హాటూ, కామెడీలు స్వీటూ.

ఆధ్యాత్మిక సాహిత్యం అయితే పళ్లూ, పాలూ లాంటివి శుద్ధ సాత్వికాహారం అన్నమాట.

సస్పెన్స్, క్రైమ్, రొమాంటిక్ థ్రిల్లర్స్, అన్నీ ఫాస్ట్‌ఫుడ్ సెక్షన్. ఇంక ఆవకాయా, తరవాణీ".

"వదినా, వదినా! అతి ముఖ్యమైన పాయింటు మరిచిపోయావు. తింటే గారెలు తినాలి. వింటే భారతం వినాలి."

"లేదమ్మా మరదలా, మరిచిపోలేదు. ఆ సామెతని జీడిపప్పూ- బాదం పప్పూలా పైన అద్దుదామని సెపరేట్‌గా వుంచాను."

"అరెరె, సారీ వదినా! తరవాణీ దగ్గర ఆపేశాను. కేరీ ఆన్..."

"వొద్దొద్దు, ప్లీజ్ రమా వద్దన చాలు. కడుపు నిండిపోయింది. తరవాణీ అసలొద్దు."

"అప్పుడేనా? పోనీ శృంగార పద్యాల మద్యం సేవించండి."

"బాబోయ్. మద్యమూ వద్దు, మదిరాక్షులూ వద్దు. నువ్వు ఘనమైన రచయిత్రివే సంతోషంగా ఒప్పుకుంటున్నాను. వంటా, వార్పూ సాహిత్యంలో నీ కృషికి అన్నపూర్ణా స్వర్ణ కంకణం ఇవ్వాలి. అమ్మా మరి నీ మాటేవిటి?"

"నా మాటకేం వంకరా? వేదవాక్కు, శిలాశాసనవూను. వదినా మరదళ్లిద్దరి విషయంలోనూ కొద్దో గొప్పో చర్చలూ, వివాదాలూ ఉత్తర ప్రత్యుత్తరాలూ సారీ, వెరీసారీ అలవాటుగా వచ్చేసింది- తర్జన, భర్జనలూ జరిగాయి కానీ నా విషయంలో మాత్రం ఎలాంటి సందేహానికీ తావు లేదు. నేను నూటికి నూరు పాళ్లూ నిఖార్సైన రచయిత్రిని. నే రాసిన ఒకో ఉత్తరం సాహితీ ప్రస్థానంలో నేనెగరేసిన విజయ కేతనం."

"అతడనేక యుద్ధముల నారియుతేరిన వృద్ధ మూర్తి"అన్నట్టు మీరు బాగా సీనియర్ రైటర్ కూడానూ అత్తయ్యా! అసలు ఆ సభలో మీకు అధ్యక్ష పీఠం ఇస్తే సముచితంగా వుంటుందని నా అభిప్రాయం."

"ఏమ్మా నువ్వూ, శిరీషా కూడా రమతో ఏకీభవిస్తారా?"

"నిర్ద్వంద్వంగా! లక్ష వత్తుల నోములా లక్ష ఉత్తరాలు రాశాను. నాతో పోటీకి రాగల రచయిత్రిని ఒఖ్ఖర్ని వేలు మడిచి చూపెట్టమనండి చూద్దాం!"

"అమ్మా ఆ లక్ష ఉత్తరాలూ నీ వంతు సాహిత్యసేవ ఖాతాలో జమకట్టుకోవాలా?"

"అదేవిట్రా రాజూ! అంత తెలివితక్కువగా అడుగుతావూ? లేఖా సాహిత్యానికి నిర్వచనం ఏవిటనుకున్నావు. పైన సంబోధనా, చివర సంతకం పక్కన చేరవలసిన చిరునామా ఈ మూడింటిలో ఏ ఒక్కటున్నా వుండి, మధ్యలో మేటర్ ఏదైనా ఆ ఉత్తరం లేఖాసాహిత్యం కోవలోకే చేరుతుంది. కార్డు ధర కాణీ వున్నప్పట్నించీ యిప్పటి కాంపిటీషను కార్డుల వరకూ ఎత్తిన చెయ్యి దించకుండా ఉత్తరాలు రాస్తూనే వున్నాను."

"అయితే అమ్మా నువ్వు చదువుకునేప్పుడు రాసిన లీవ్ లెటర్సూ, పుట్టింటి నించి నాన్నకి పాల బాకీ, చాకలీ, పనిమనిషీ ఇంటద్దె, బొగ్గుల బస్తా వీటికి ఎవరికెంత యివ్వాలో రాసిన ఉత్తరాలూ, బంధుమిత్రులకి రాసిన ఫార్మల్ లెటర్సూ అన్నీ లేఖా సాహిత్యమేనా?"

"నిక్షేపంలా... పెద్ద పెద్ద వాళ్ల డైరీలూ, ఉత్తరాలూ అచ్చేస్తారు. ఎప్పుడూ చదవలేదా? గుర్రబ్బండి వాడికిచ్చిందీ, పూటకూళ్లమ్మకిచ్చిందీ, కూరా, నారా కొన్నదీ అన్ని జమాఖర్చులూ వాళ్ల ఉత్తరాల్లో వుంటాయి. దాన్నే లేఖాసాహిత్యం అంటారు.

వారఫలాలూ, వంటలూ, సీరియల్, నవలా లేని పత్రిక వుండచ్చు కానీ ఉత్తరాల శీర్షిక లేని పత్రిక వుంటుందా? అసలలాంటి పత్రికని ఊహించగలమా?"

"నెవ్వర్, నెవ్వర్, మాట్లాడవేందమ్మా వృత్తి వైరమా, జాతి వైరమా?"

"ఒరేయ్, మాకలాంటివేం లేవు. మామూలు మనుష ల్లాగా..."

"ఉండండి, నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. వర్ధమాన రచ యితల్ని వెన్నుతట్టి ప్రోత్సహించేదీ, ఉత్తేజితుల్ని చేసి ముందుకు నడిపించేదీ మా ఉత్తరాలే. ఇవాళ మహోత్సా హంతో రాష్ట్ర రాజధానిలో సభలు జరుపుకునే స్థాయికి ఆంధ్ర రచయిత్రులు ఎదిగారంటే దానిక్కారణం..."

"ఉండుండు నే చెప్తాన్నమ్మా.నాకు తెలిసిపోయింది'... దానిక్కారణం ప్రశంసల జల్లులు కురిపించే పాఠకుల ఉత్త రాలే కానీ రచయిత్రుల ప్రతిభాపాటవాలు ఎంతమాత్రం కారణం కాదనీ..."

"రమా, వీడిని మెప్పించడం మానవమాత్రుల తరం కాదు కానీ, లే యింక పనిలో పడాలి. ముందు శిరీషక్కాస్త కాఫీ యియ్యి. తొందరపడుతోంది యింటికెళ్లాలని.

* * *

"ఏం వదినా, అప్పుడే బట్టలు సర్దేస్తున్నావు? ఇవన్నీ తీసికెళ్లాల్సినవేనా?"

"కాదమ్మా తల్లీ అసలేం వున్నాయో, ఏవన్నా కొనాలో మాచింగ్స్ అవీ చూసుకుంటున్నాను."

"నేనూ యిప్పటివరకూ అదునే చూసి ఏం తీసికెళ్లాలో ఏం కొనాలో తేలక యిటొచ్చాను."

"నువ్వు అన్నీ చీరలేనా, డ్రెస్సులేవన్నా తెస్తున్నావా? శిరీషా, మొగాళ్లతో హాయిగా పెద్ద పెద్ద లాల్చీలు వేసేసు కుంటారు. కవి కుమారుల ట్రేడ్‌మార్కు. మనకే ఏంచే య్యాలో తెలీడంలేదు. హెయిర్ కూడా తేల్చుకోలేకపో తున్నా. జుట్టు అలా వదిలెయ్యాలో జడో, సిగో, పువ్వులు పెట్టుకోవాలా మానెయ్యాలా పెట్టుకుంటే ఏం పువ్వులో, నగలు ఎంతవరకూ వేసుకోవచ్చు. అన్నీ అనుమానాలే."

"సింపుల్, సింపుల్ అంటూ లైట్ కలర్ కాటన్ చీర, ఒంటిపేట గొలుసూ వెళ్తే మరీ ఏబ్రాసి మొహాల్లా వుంటా వేమో వదినా! కాస్త గ్రాండ్‌గా వుండే నగలూ, బట్టలూ వేసుకుంటే పెళ్లికో, పేరంటానికో వెళ్తున్నట్టు తయారయ్యా రని అందరూ నవ్వుకుంటారని భయం."

"టి.వి. ఇంటర్వ్యూలో చూడడంలేదు కొందరు రైటర్స్ ఎంతెంత జరీ చీరలు కడుతున్నారో. అన్నీ తీసికెళదాం. ఎవరికీ తీసిపోకుండా వుండాలి."

"నేనిన్ని రకాలు మార్చలేనమ్మా. పగలు పట్టు చీరలు, సాయంత్రం సన్నజరీ చీరెలూ అది సరే, బట్టల సంగతి అలా వుంచి మీ వర్క్స్ తెచ్చుకోండి. అక్కడ కాన్ఫరెన్సులు వుంటాయి. చదవాల్సి రావచ్చు."

'మనవరకూ రానిస్తారా అత్తయ్యా."

"రానివ్వరు. మనవే చొరవగా ముందుకు తోసికెళ్లిపోవ డవే. ఇంత దూరంనించి పనిగట్టుకు వెళ్లేది ఓ మూల కూచుని రావడానికా? నలుగురి దృష్టిలోనూ పడాలి. అన్ని పేపర్లలో ఫొటోలు రావాలి. ఈ దిక్కుమాలిన ఊళ్లో వుండబట్టి ఊరుపేరూ లేకుండా అయిపోయాం కానీ యిప్పుడు రాసేస్తున్న వాళ్లందరూ మనకన్నా గొప్ప వాళ్లా?"

"నిజమే అదేవిటమ్మా ఆ సిమెంటు బస్తా? ఏవున్నా యందులో?"

"సిమెంటు బస్తా ఏవిటే అసహ్యంగా, అది నా లేఖా సాహిత్యం."

"అమ్మా, లక్ష ఉత్తరాలూ తెచ్చేస్తున్నావా?"

"తేవాలనే వుంది కానీ ఎలా కుదురుతుందే?" ముఖ్య మైనవి పట్టుకొస్తున్నాను. రమా, నువ్వు కూడా పత్రికల్లో పడ్డ నీ వంటల కటింగ్స్ అన్నీ తెచ్చుకో. చిట్కాలన్నీ ఫింగర్ టిప్స్ మీద వుండాలి. వంటల క్విజ్ ఏదన్నా పెట్టా రనుకో తడుముకోఖ్ఖర్లేదు. తరవాత ఏదెన్నా అట్టపెట్టె చూడు. వచ్చేటప్పుడు మనకిచ్చిన మెమెంటోలు అవీ జాగ్రత్తగా తెచ్చుకుందుకుంటుంది."

"అత్తయ్యా ఇంకో రోజు వుండి షాపింగ్ చేసుకుని, చుట్టాలు నలుగురినీ చూసుకుని వస్తే బావుంటుంది."

"నేనూ అలాగే అనుకున్నాలే. ముఖ్యమైన పని యింకో

అసలే హైదరాబాదు వాతావరణం కాలుష్య భరితం. పులిమీద పుట్రలాగా యిప్పుడీ బెడద ఒకటి. కవి సమ్మేళనాలూ, చర్చలూ, గోష్ఠులూ, ఉపన్యాసాలూ, సందేశాలు. వీటితో కాలుష్యం ఏ స్థాయికి పెరుగుతుందో ఊహించడానికే భయపడుతున్నారు. నివారణ చర్యలు చర్చించడానికి శాస్త్రవేత్తలందరూ సమా వేశమయ్యారు.

టుంది. అక్కడికి వచ్చే పెళ్లికాని పిల్లల్లో మన రఘుకి సరి పోయే పిల్ల ఎవరేనా దొరుకుతుందేమో చూడాలి. నాకు చిన్నకోడలిని కూడా రచయిత్రినే తెచ్చుకోవాలని వుంది. అప్పుడు అత్తాకోడళ్లు ముగ్గురూ రచయిత్రులైన కుటుం బంగా పేరొస్తుంది."

* * *

"అమ్మా, యివాళ శిరీష రాలేదా?"

"టికెట్స్ రిజర్వు చేయించటానికి స్టేషనుకి వెళ్లిందిరా. వచ్చేస్తుంది."

"రిజర్వేషను అఖ్ఖర్లేదమ్మా, హైదరాబాదు రచయిత్రుల సభలకు వెళ్లే వాళ్లకోసం ప్రతి ఊరునించీ స్పెషల్ బస్సులు వేస్తున్నారుట. టిక్కెట్టు కొనుక్కోఖ్ఖర్లేదు. ఫ్రీ"

"కుంభ మేళాలకీ, పుష్కరాలకీ వేస్తారు అలాగన్నమాట. ఫ్రీ అనేసరికి అలగాజనం అంతా వచ్చిపడతారు. మామధ్య కూచుంటారు. ఎలా?"

'నీకాభయం అఖ్ఖర్లేదమ్మా. సామాన్య ప్రజలందరూ కలిసి ప్రభుత్వానికి విన్నపం పంపుకున్నారుట. ఎప్పుడైనా తప్పక ఒకటిరెండు గంటలు కవి సమ్మేళనానికో, సాహితీ సమావేశానికో వెళ్లొస్తేనే మనసంతా పాడైపోయి మామూలు మనుషులం అవం కదా, అలాంటిది మేధావి వర్గానికి చెందిన యింతమంది రచయిత్రులతో కలిసి గంటలకొద్దీ ప్రయాణించేస్తే మా మనసు గతేం కాను? అందుకని దయచేసి మా బస్సులు మాకు మామూలుగా నడపండి. రచయిత్రుల బస్సుల్లో మేం ఎక్కం. పిల్లా పాపా గలవాళ్లం అవటం. అదీ సంగతి!"

"నేను యిందాకే అన్నాగా' అలగా జనంతో కలిసి ఎలా వెళతాం" అని. మంచి ఆలోచనే.

"అమ్మా హైదరాబాదులో వున్న స్త్రీలందరూ టీకాలు వేయించుకుంటున్నార్ట."

"ఎందుకండీ?"

"ప్రివెన్షన్ మేడమ్ ప్రివెన్షన్. నివారణే తప్ప మందు లేని భయంకర వ్యాధి రాకుండాను. రచయిత్రి అనిపించుకోవా లనీ, అచ్చులో పేరు చూసుకోవాలనీ, సన్మానాలు చేయిం చుకోవాలనీ, వేదికనలంకరించాలనీ తీవ్రమైన కోరిక కల గడం చాలా త్వరగా వ్యాపించే అంటువ్యాధి. ఆఖరి నిమి షంవరకూ పట్టిపీడించేదీ ఏ వైద్య విధానంలోనూ మందు లేనిదీను. అంచేత భర్తలూ, తండ్రులూ, సోదరులూ ఇలా మగవాళ్లందరూ ఎవరి తాలూకు ఆడవాళ్లని వాళ్ల నయాన్నా భయాన్నా తీసికెళ్లి టీకాలు వేయించుకొస్తున్నా రుట. జంట నగరాల్లో ఆస్పత్రులన్నీ హౌస్‌ఫుల్."

"ఒరేయ్, రాజూ, నీకు మరీ వేళాకోళ్లవైపోయిందిరా, నువ్వెప్పుడొచ్చావే శిరీషా. టిక్కెట్లు దొరికాయా, లోయర్ బెర్తులేనా?"

"ఆఁ ఏవిటమ్మా అన్నయ్యేదో జాగ్రత్తలు చెప్తున్నాడు."

ఇంకా వున్నాయి లేవే. అయిపోలేదు. విను. కొంత మంది మాయల ఫకీర్లు ఈ వ్యాధి సోకకుండా, "తాయె త్తులు కడతాం, మూలికలు యిస్తాం" అని తిరుగుతున్నా రుట. అలాంటివాళ్లని నమ్మి మోసపోకండి. మందుల్లేవు. "ఒక్క టీకాలే శరణ్యం కావాలంటే జడుపు జరం రాకుండా తాయెత్తులు కట్టించుకోండి." అని జీపుల్లో మైకులు పెట్టుకుని మరీ చెప్తున్నారు ప్రభుత్వంవారు. టీకాలు వేయించుకున్న ఆడపిల్లలకి పెళ్లిసంబంధాలు కూడా తొరగా కుదురుతాయని తల్లిదండ్రులు ఆశపడుతు న్నారుట.

"ఎంత కష్టపడి సేకరించారో ఈ సమాచారం. వింటాం లెండి. పాపం, చెప్పండి, చెప్పండి".

"అసలే హైదరాబాదు వాతావరణం కాలుష్య భరితం. పులిమీద పుట్రలాగా యిప్పుడీ బెడద ఒకటి. కవి సమ్మేళ నాలూ, చర్చలూ, గోష్ఠులూ, ఉపన్యాసాలూ, సందేశాలు, వీటితో కాలుష్యం ఏ స్థాయికి పెరుగుతుందో ఊహించడా నికే భయపడుతున్నారు. నివారణ చర్యలు చర్చించడానికి శాస్త్రవేత్తలందరూ సమావేశమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా సభలు జరిగే ప్రాంతానికి పది కిలోమీటర్ల పరి ధిలో వున్న ఇళ్లన్నీ ఖాళీ చేయించేస్తున్నారు.

ఆకాశవాణీ, దూరదర్శన్ కేంద్రాలు తుఫాను హెచ్చరికల సమూనాలో గంట గంటకీ ప్రసారం చేద్దామా అని ఆలో చిస్తున్నట్టు భోగట్టా. ఇంకా విను ఈ సందర్భంగా బట్టల షాపుల వాళ్లందరూ 50% డిస్కౌంటు ఆఫర్ చేస్తున్నా రుట. అమ్మకాలు గరిష్ఠ రికార్డుస్థాయిలో వుండగలవని అంచనా. అంతేకాదు సభలు జరిగేచోట షామియానాలు వేసి పిల్లల బట్టలు, దుప్పట్లు, కర్టెన్లు, వంట సామాను, అప్పడాలూ, ఒడియాలూ, అప్పడాల కర్రలూ, కత్తిపీ టలూ, అట్లకాడలూ, పెనాలూ, పోపుల పెట్టెలూ ఇత్యాదు లన్నీ సరసమైన ధరలకు సరఫరాచేసే ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయిట.

మర్చిపోయాను ఒక కిలోమీటరుకి రెండు చొప్పున బ్యూటీ పార్లర్లు వెలిశాయిట."

"అన్నయ్యా ఈ చివరి రెండు వార్తలూ మరీ అరిగి పోయి మాసిపోయిన జోకులు."

"ముఖ్యమైన సమాచారం, ప్రముఖ రచయిత్రుల కిడ్నా పులు కూడా జరగవచ్చని అనుమానిస్తున్నారు. ఎందుకేనా మంచిది మీరు ముగ్గురూ జాగ్రత్తగా వుండండి."

"రాజూ నువ్వెంత ఏడిపించినా మేం వెళ్లే తీరతాం."

"ఎంతమాట, వెళ్లండి, వెళ్లండి. సభలు జయప్రదం, దిగ్విజయం చెయ్యండి. బెస్టాఫ్‌లక్.! చివరగా చిన్న సూచన- మీరు వేదిక ఎక్కేటప్పుడు ఆ మెట్లు కళ్లకద్దుకుం టారుగా చాలు. మరీ హైదరాబాద్‌లో దిగగానే ఆ పని చేయకండి. ఏం లేదు ఎవరూ పట్టించుకోరు. పైగా మీరు ఆ ముద్రలో వుండగా మీ సామానులకు భద్రత లేదు. అందుకని..."

★